క్లుప్తంగా

వృత్తి విద్యపై మక్కువ పెంచుకోవాలి



శిక్షణ తరగతులను తనిఖీ చేస్తున్న ఇంద్రాణి

రొంపిచెర్ల: వృత్తి విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జిల్లా బాలిక సంరక్షణ అధికారిణి ఇంద్రాణి అన్నారు. రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల్లో జరుగుతున్న ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంటర్న్‌షిప్ చేయడం వలన ఉన్నత చదువుకు దోహద పడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో వృత్తి విద్యా కోర్సుల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కళాశాల విద్య ముగిసే సమయానికి విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడేందుకు పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసోర్స్‌పర్సన్ శశికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆశాలకు అవగాహన కల్పిస్తున్న రాజేశ్వరి

రొంపిచెర్ల: గ్రామాల్లో జ్వరాల వ్యాప్తిపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల అవగాహన సమావేశాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తల్లి, శిశువులలో ప్రమాదకర లక్షణాలు ఉంటే వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు. గర్భవతులను సకాలంలో నమోదు చేసి వారికి క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలను ఇవ్వాలని చెప్పారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల వైద్యాధికారి రాజశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

మహ్మద్ రఫీ సేవలు వేలకట్టలేనివి



ఎంపీడీఓకు వీడ్కోలు కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్

వి.కోట: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా మహ్మద్ రఫీ సేవలు వేలకట్టలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. వి.కోట ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ రఫీ బదిలీ కావడంతో మంగళవారం ఆయనకు కార్యాలయ సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ ఎంపీడీఓకు దుశ్శాలువాలతో సత్కరించి ఆయన మండల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఎంపీడీఓ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మండలంలోని ఆళ్వారుపల్లి క్రాస్‌లో వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు(పులిచెర్ల): సాగులో ఉన్న పంటకు ఈకేవైసీ తప్పనిసరని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కావేటిగారిపల్లె, గలసంవారిపల్లెల్లో కార్యక్రమం నిర్వహించారు. పంటలకు ఈకేవైసీ చేసుకోవాలని, డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించారు. మల్లికార్జున, మంజుల, గణేష్ పాల్గొన్నారు.

గోశాల నిర్వహణకు విరాళం



తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీకి అందజేస్తున్న ఈఓ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను మంగళవారం బెంగళూరు సిటీ ఎమ్మెల్సీ రామోజీ గౌడ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దసరా ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గోశాల నిర్వహణకు రూ.25 వేలు విరాళమిచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు.



తహసీల్దార్‌కు సమస్య విన్నవించుకుంటున్న బాధితులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

పేదల స్థలాలపై తమ్ముళ్ల పంజా

పేద ప్రజల ఇళ్ల స్థలాలపై టీడీపీ తమ్ముళ్లు కన్ను వేశారు. డ్రైవర్స్ కాలనీ అనుకుని ఉన్న జగనన్న కాలనీలో గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను కొల్లగొడుతూ వీరంగం సృష్టించారు. ప్రైవేట్ స్థలాలను ధ్వంసం చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలు, పునాదులు జేసీబీలతో రాత్రుళ్లలో ధ్వంసం చేశారు. కాలనీని పూర్తిగా కొల్లగొట్టి భూమి దురాక్రమణకు పాల్పడుతున్నారు. వీళ్ల ఆగడాలు అరికట్టేవాళ్లు కరువయ్యారంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేశారు.



కాలనీలో తవ్వేసిన పునాదులు

- జగనన్న కాలనీని కొల్లగొడుతున్న టీడీపీ నేతలు
- దురాక్రమణకు యత్నం
- రాత్రుల్లో ధ్వంసం
- బాధితుల ధర్నా

సాక్షి టాస్క్‌ఫోర్స్: గంగవరం మండలంలోని డ్రైవర్స్ కాలనీ అనుకుని ఉన్న ఇళ్ల స్థలాలు ఇదే కాలనీకి చెందిన టీడీపీ నేతలు ధ్వంసం చేశారంటూ బాధితులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ స్థలాలపై తమకు సర్వాధికారాలు ఉన్నా టీడీపీ నేతలు కుట్ర చేసి కొల్లగొట్టేశారని ఆరోపించారు. తహసీల్దార్‌కు సమస్య విన్నవించి తమకు న్యాయం చేయాలంటూ బాధితులు తహసీల్దార్‌ను వేడుకున్నారు. వాళ్లు మాట్లాడుతూ వందమందికి పైగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అయితే ఈ కాలనీకి చెందిన రవి, శివ కలసి తమ స్థలాలు ధ్వంసం చేసి పునాదులు సహా పెకలించేశారని ఆవేదన చెందారు. కాలనీలోని స్థలమే కాకుండా ఏళ్ల తరబడి తమ ఆధీనంలో ఖాళీగా ఉన్న స్థలాలపై సైతం పచ్చ తమ్ముళ్ల కన్ను పడి కూలగొట్టారంటూ బాధిత ప్రజలు ఆరోపిస్తున్నారు. అడిగితే ఎమ్మెల్యే చెపితేనే స్థలాలను ధ్వంసం చేస్తున్నాం.. జగన్ ఇచ్చిన పట్టాలు చెల్లవు.. మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ తమపైనే దౌర్జన్యాలకు పాల్పడినట్టు బాధితులు ఆవేదన చెందారు. ఎలాగైనా తమ స్థలాలు తమకే కేటాయించేలాచర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

వెన్నుపోటుగా మారిన పాలక వర్గం..

జగనన్న కాలనీ అనగానే గుర్తొచ్చేది పేద ప్రజలు. ఇళ్లులేని నిరుపేదలకు ఒక ఆశ్రయం కల్పించి తమ సొంతింటి కలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. పేద ప్రజలకు సెంటున్నర స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలాలపై టీడీపీ నేతలు కన్నేశారు. గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీ అనుకుని ఉన్న పేద ప్రజల ఇళ్ల స్థలాలను రాత్రుళ్లలో జేసీబీలతో తమ్ముళ్లు కొల్లగొట్టేశారు. ఆ ప్రాంతంలో ఇంటి స్థలాలు కలిగిన వాళ్లు ముస్లిం కుటుంబాలే అధికం. అయితే టీడీపీకి చెందిన స్థలాలను విడిచి తమ స్థలాలను మాత్రం పూర్తిగా ధ్వంసం చేశారని మండిపడుతున్నారు. గత ప్రభుత్వం పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలబడితే ఈ ప్రభుత్వం తమకు వెన్నుపోటుగా మారిందంటూ బాధిత మహిళలు ప్రభుత్వ పాలకులపై మండిపడుతున్నారు. ఇక్కడ మాకు న్యాయం జరక్కుంటే సమస్య పరిష్కరించుకునేంత వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

50 మందికి పైగా బాధితులు

గత పాలనలో స్థలంతో పాటు ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణానికి సరిపడా డబ్బులు లేక నిర్మాణ పనులను వాయిదా వేశారు. డబ్బులు సర్దుబాటుకు సరిపడా పనులు చేసుకుంటూ కొంతమందివి పునాదులు, గోడలతో పనులు ఆగిపోయాయి. ఈ ప్రభుత్వం పేద ప్రజలకు వ్యతిరేకంగా మారిందంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేకు తమ సమస్య చెప్పుకుందామని బాధితులంతా వెళ్తే ఆయన అందుబాటులో లేకపోవడం, పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని చెప్పడం, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా పరిష్కారం దొరుకుతుందో లేదో అని బాధపడుతున్నారు. స్థలాలు పోగొట్టుకున్న బాధితుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. పరిష్కారం దొరికే మార్గం దొరక్క సమస్యతో సతమతమవుతున్నారు. ఏదేమైనా సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం పరిష్కారం లభిస్తుందో లేదో అనే సందిగ్ధంలో బాధితులు ఉన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

ఇన్ని రోజులుగా డ్రైవర్స్ కాలనీలో ఇలాంటి సమస్య ఉందని ఇంత వరకూ నా దృష్టికి రాలేదు. ఇప్పుడే తెలిసింది. మా సిబ్బందిని గ్రామానికి పంపి విచారణ చేస్తాం. అక్కడ సమస్య ఉందని రుజువైతే కచ్చితంగా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తాం.

తహసీల్దార్, శివకుమార్

జగనన్న ఇచ్చిన స్థలం కబ్జాచేశారు



గత ప్రభుత్వంలో జగనన్న ఇంటి స్థలం ఇచ్చి ఆదుకున్నారు. ఈ ప్రభుత్వంలో టీడీపీ నేతలు పునాదుల్ని తవ్వేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జాగాలో వెలుగు గ్రూపులో లోన్ తీసుకుని పునాదులు వేశాం. టీడీపీ నేతలు పునాదులను తవ్వేశారు. మాపై దౌర్జన్యం చేశారు. మాకు న్యాయం చేయాలి

శాతాజ్, డ్రైవర్స్ కాలనీ

స్థలంకొని కూతురికి ఇచ్చా



15 ఏళ్ల క్రితం స్థలం కొని కుమార్తెకు ఇచ్చాను. కడగాలు వేశాం. గత నెలలో ఇంటి కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటే ఇళ్లు మంజూరు కానీకుండా టీడీపీ నేత కుట్ర చేశాడు. ఇప్పుడేమో ఇంటి కడగాలు కూలదోస్తానంటూ బెదిరిస్తున్నాడు. ఇదేనా చంద్రబాబు పాలన అంటే. మాకు న్యాయం చేయండి.

షమీమ్, డ్రైవర్స్ కాలనీ

ఎమ్మెల్యే చెపితేనే కూల్చేస్తున్నారంట



మా స్థలాలను ధ్వంసం చేయమని ఎమ్మెల్యే చెప్పినారంట. అలాగని నేతలు చెప్పారు. మూడేళ్ల క్రితం పునాదులు వేశాం. ఎమ్మెల్యే చెప్పారని రాత్రికి రాత్రే జేసీబీతో తవ్వేశారు. పార్టీల పరంగా మమ్మల్ని భయంకరంగా హింసిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో నిజాయితీగా ఎవరూ పని చేయడం లేదు. 50కి పైగా పునాదులు తోసేశారు. అధికారులు న్యాయం చేయాలి

సునంద, డ్రైవర్స్ కాలనీ

ఏరియా ఆస్పత్రిని పచ్చదనంతో నింపుదాం

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విరివిగా మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మోటార్ యజమానుల సంఘ నేత జిలానీ సూచించారు. ఆమేరకు ఆస్పత్రి వద్ద పలు రకాలకు చెందిన 120 మొక్కలను మంగళవారం నాటారు. కార్యక్రమానికి డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, సూపరింటెండెంట్ మమతారాణి, డా యుగంధర్ హాజరయ్యారు. విశాలమైన ఆస్పత్రి పరిసరాల్లో భారీగా మొక్కలను నాటి పచ్చదనంతో కనిపించేలా మార్చాలనే లక్ష్యంతో తాము కృషిచేస్తున్నట్టు జిలాని పేర్కొన్నారు.



ఆస్పత్రి వద్ద మొక్కలను నాటుతున్న జిలాని

ఈడిగలకు ప్రాధాన్యత ఇవ్వండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మద్యం షాపుల కేటాయింపులో కల్లుగీత కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఈడిగ గౌడ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులలో మాట్లాడారు. ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపులో కల్లుగీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రస్తావనే ఇప్పుడు లేదన్నారు.

ముక్తి ప్రదాయనీ..నమోస్తుతే



బోయకొండలో ధనలక్ష్మీదేవిగా..



పుంగనూరులో..



సదుంలో..



వి.కోటలో..

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వర స్వామి ఆలయంలోని పార్వతిదేవి, విరూపాక్షి మారెమ్మ ధనలక్ష్మి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

సదుంలో..

సదుం: జాంద్రపేట రామలింగచౌడేశ్వరీ దేవి, రెడ్డివారిపల్లె చామంతుల ఎల్లమ్మ, పచార్లమాకులపల్లె గంగాపురమ్మ ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులను కటాక్షించారు.

సరస్వతీ దేవిగా..

వి.కోట: పట్టణంలో వెలసిన వాసవీ, దుర్గామాత అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు.

కల్లూరులో..

కల్లూరు(పులిచెర్ల): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతీ అలంకరణలో భక్తులను కటాక్షించారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామపంచాయతీలోని ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

మహాలక్ష్మి అలంకరణలో..

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలో వెలసిన సల్లాపురెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థం గ్రామంలో హనుమంత వాహనంపై శ్రీరామచంద్రస్వామి పురవీధుల్లో విహరించారు. బైరెడ్డిపల్లె వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బాటగంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. .

కుప్పంలో..

కుప్పం: స్థానిక తిరుపతి గంగమ్మ దేవాలయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గుత్తార్లపల్లి గ్రామంలో వెలసిన అగ్నిమారెమ్మ పసుపు అలంకరణలో దర్శనం ఇచ్చారు.

గంగవరంలో..

గంగవరం: మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీమలాలమ్మ ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మి అవతారంలో భక్తులను కటాక్షించారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని పాతపేట దుర్గమ్మ, కొత్తపేట బసవన్న, శివాలయాల్లో మంగళవారం దుర్గాదేవి మాహాలక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు.



కల్లూరులో..



రొంపిచెర్లలో...



బైరెడ్డిపల్లెలో..



కుప్పంలో..



గంగవరంలో..

సాగు ఖర్చులను నియంత్రించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ

శాంతిపురం: రైతులు లాభసాటి వ్యవసాయం కోసం సాగు ఖర్చులను క్రమంగా తగ్గించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె కడపల్లి, కదిరిఓబనపల్లి, పాకంపల్లి గ్రామాల వద్ద రైతుల శిక్షణలో పాల్గొన్నారు. రసాయనాల వినియోగాన్ని నియంత్రిస్తూ సేంద్రియ సేద్యం, పద్ధతులను పాటించాలని చెప్పారు. పంటల సాగులో పురుగుమందులు, ఎరువుల కోసం అధికంగా ఖర్చు అవుతుందన్నారు. వీటిని అధిగమించేందుకు నామమాత్రపు ఖర్చుతో సేంద్రియ మందులను, ఎరువులు రైతులే తయారు చేసుకోవచ్చన్నారు. దీని కోసం జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అప్పోజి, సెరికల్చర్ ఎస్‌ఓ రవీంద్రారెడ్డి, రైతు సమాచార కేంద్ర సిబ్బంది గోవర్ధన్, నవీన్, మునెమ్మ పాల్గొన్నారు.

బిందుసేద్యంతో నీటిని ఆదా చేసుకోండి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పీడీ, ఏడీ

పుంగనూరు: రైతులందరూ బిందుసేద్యాన్ని తమ పొలాలకు ఏర్పాటు చేసుకుని నీటిని ఆదా చేసుకుంటూ సాంకేతిక పద్ధతుల్లో పంటలు పండించాలని ఏపీఎంఐబీ పీడీ బాలమురగన్ సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నెక్కుంది గ్రామంలో నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బిందుసేద్యం సబ్సిడీ కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. అవసరమైన వారందరికి బిందుసేద్యం పరికరాలను సబ్సిడీ కింద పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు కూడా బిందు సేద్యం ఎంతగానో ఉపయోగపడుతుందని, నీటి సమస్య లేకుండా ఉన్న నీటినే వినియోగించుకుని పంటలు పండించుకునేందుకు వీలుందన్నారు. ఏడీ శివకుమార్ మాట్లాడుతూ ఈక్రాప్‌ను పూర్తి చేశామన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే అన్ని రకాల సబ్సిడీలకు ఈక్రాప్ నమోదు ఎంతో అవసరమని సూచించారు. ఏఓ టెక్నికల్ ఫయాజ్, రైతు శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ హరినాయక్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



వివరాలు వెల్లడిస్తున్న వెంకటరమణ

చౌడేపల్లె: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని న్యాయవాదులు వెంకటరమణ, సీవీ రమేష్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్త్రీశక్తి భవనంలో మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టం పట్ల అవగాహన కల్పించారు. సమాజంలో స్త్రీలకు పురుషుడితో సమాన హక్కులు ఉన్నాయని గుర్తు చేశారు. మహిళా చట్టాలను వివరించి చైతన్యం కల్పించడమే సదస్సు ధ్యేయమని కొనియాడారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయస్థానం ద్వారా ఉచితంగా న్యాయసేవలను పొందే హక్కు కల్పించిందన్నారు. అవకాశాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ హనుమంతునాయక్, సీడీపీఓ రాజేశ్వరి, ఏపీఎం సుబ్రమణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సులోచన పాల్గొన్నారు.

వచ్చిన కేసులన్నీ రెఫర్ చేస్తే ఎలా?



తనిఖీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

పలమనేరు: జిల్లాలోనే సువిశాలమైన ఆస్పత్రి, అవసరమైన వైద్యులు, సిబ్బంది ఉన్న పలమనేరు ఆస్పత్రి నుంచి రాత్రిపూట అత్యవసర రోగులకు నైట్ డ్యూటీ డాక్టర్లు ఎందుకు రెఫర్ చేస్తున్నారంటూ డీసీహెచ్‌ఎస్ ప్రభావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి రికార్డులను, ఓపీని పరిశీలించారు. అత్యవసర విభాగంలోని రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పలు దినపత్రికల్లో ఇక్కడి ఆస్పత్రిలో రెఫర్లే దిక్కంటూ కథనాలు వస్తున్నందున తాను తనిఖీ చేద్దామని వచ్చానన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తుంటే అందరూ అనుభవం ఉన్న వైద్యులే ఉన్నప్పటికీ ఎందుకు రెఫర్ చేస్తున్నారని అక్కడి వైద్యులను ప్రశ్నించారు. ఇకపై సాధ్యమైనంతవరకు రెఫర్‌లు లేకుండా వైద్యాన్ని అందించాలని సూచించారు. ముఖ్యంగా ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్‌ఎంఓ శారద పాల్గొన్నారు.

పశువులకు వైద్యశిబిరం



ఎర్రగుంట్లపల్లెలో పశువైద్య శిబిరం

సదుం: మండలంలోని తాటిగుంటపాలెం పంచాయతీ ఎర్రగుంట్లపల్లెలో పశుగణాభివృద్ధిసంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఇందులో 90 పశువుకు పిడుదల నివారణ, గర్భకోశ వ్యాధి చికిత్స అందించారు. మెరుగైన పశుపోషణ విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ సుబ్రమణ్యం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాలాజి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పీటీఎం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ కలకడకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారంతో కృషిచేస్తానని తెలియజేశారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

పెద్దపంజాణి: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రెండవ రోజూ నిరసనదీక్షలు కొనసాగాయి. జిల్లా నాయకులు డీవీ మునిరత్నం, పార్థసారథి మాట్లాడుతూ బెరపల్లికి చెందిన చాకలి క్రిష్ణప్ప, అప్పినపల్లికి చెందిన సాలమ్మ భూ సమస్య పరిష్కరించాలని నాలుగు నెలలుగా తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని వారు విమర్శించారు. దీక్షా శిబిరం వద్దకు రాని తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సాంబశివ, గంగప్ప, శీనా, జనార్దన్, నాగార్జున, లోకేష్ పాల్గొన్నారు.